# రడం

ఎర్ర మస్కలో మాయప్ప గుంట్కుగట్టిండు. రొట్టెల్ల ఆయని మాయమ్మ అలతేరుతున్నది. గుత్తల్లవోయిన మాట తప్పించుకొనుడు కల్ల, మా పిల్లల తండ్రికి రొట్టె పంపియ్యాలె ఎర్రగడ్డ రేవున ఎవరైన వోతె జెర జెప్పు సిన్నమ్మ అని మాలె నాగవ్వ నడిగింది మాయమ్మ.

ఇంక జెరసేపటికి ఇంటెంటకెంచి కూత వెట్టి నా అల్లునొంకల వొయ్యేటోల్లెవ్వరు లేరు కొడుకా అనంతమ్మ. ఏం జేస్తవో సుదురాయించుకో అంబటాల్లయింది. అర్కలోల్లంత ఇంటొంక ముఖం బెడుతరుబిడ్డా. నీ మొగడూ జూస్తడు. ఇక్కడనేమో కూలోళ్ల బైలెల్లిండ్రు. యాదొకటి జేసి బయటవడు కొడుకా' అని మాయమ్మను నాగవ్వ పురమాయించింది. ఏంజెయ్యాల్నో వశపడక ఆఖర్కి కూలి మానుకుందామనుకున్నది, కాని కుదెపడుతున్నది మాయమ్మ. 'నాలుగు దినాల నుండి వంగిన నడుం లేపకుండ పదిగేను మందిమి పదెకరాల కర్గెటు గుడ్డంల నాట్లేస్తిమి. ఈ పొద్దటికి మట్టం నలపై రూపాలొచ్చేటివ'ని గునిగింది. నాతో ఏమి మాట్లాడకుండానే మాయప్పకు రొట్టె సద్ది గట్టింది, సెంబునిండ సల్లవోసింది. సల్ల తెల్లగకనిపించి దిష్టి తగులుతదని అందుట్ల ఒగ బొగ్గుతుకుడేసింది. దీన్నేవరు మోసుకపోవాల్నని మాయమ్మ సోచాయించవట్టింది. నేనూ ఇంత పనిల ఆసరగావాలె అనుకున్ననేమో
' ఓయమ్మ నేను మైయప్పకు రొట్టె తీసుకపోతనే నీవు కూలికెల్లు' అన్న. ఇగ మాయమ్మ మొఖం జూడాలె ఐదు నిండు పున్నాల నెలపొద్దులు ఒకేనాడొచ్చి ఎన్నెల రాల్చినంత సంబరం.

'పోతవా ల్యాగ మాయమ్మ గద మెల్లెగవో కొడుక' అని పొయికాడికురికి రొట్టెపెంచు అడుగుకున్న మసిని చూపుడు వేలుకు అద్దుకొచ్చింది. నా అరికాలుకు, అరచేతికి, కంతల్ల దిష్టిచుక్క వెట్టింది. 'సడాక్ పక్కపొంటి నడ్సుకుంటవో కొడ్క, అక్కడిక్కడ దిక్కులు జూస్కుంట వోకు, తట్టుతాకి కిందవడ్తవ్. ముందల ముందల జూస్కుంట నిమ్మలంగ ఎదార్థంగా నడువ్ నాయనా' ని తీరొక్క ఉపాయం జెప్పవట్టింది. ఎవరైన తాతొర్స మామొర్స అయినోల్లు పరిష్కానికి అక్కడిక్కడ జూడమంటె కూడా సూడకు నాయన' అన్నది.

ఇగ నెత్తిమీద రొట్టె మూట వెట్టుకొని బాట వట్టిన. మాయప్ప నన్ను జూసి తెగ మెచ్చుకుంటడని, మనుసులో తల్సుకుంట ఎప్పుడు సేనికి జేరి మాయప్ప కంట్ల వడాలనే ఉబలాటంతో బిరాబిరా నడుస్తున్న. సడాకు దాటి పిల్ల బాట వట్టిన. గడ్డ ఎక్కి దిగుట్ల తలారి సామేలు తాత నన్ను జూసి పరేషాన్ అయిండు. "ఏం మన్మరాల మీయప్పకు రొట్టెదీస్కపోయేంత దానివయినావ్ పైలంగబో ల్యాగ" అన్నడు. "అయితాయనే తాత" అని బదులు చెప్పిన. బాట పక్కపొంటి పెద్ద నల్లరాయి ఒకటుంటే దానిమీద సల్లసెంబు జెరసేపు వెట్టిన. నెత్తిమీద రొట్టె సద్దిని దించిన, అటు ఇటు జూసి నీల్గిపోయినట్లయిన నా చేతిని గట్టిగా ముడ్సుకొని తెర్సుకొని చేతినటుఇటు ఆడించిన. సెంబుల సల్ల జెరంత నోట్లవోసుకుని మింగి సప్పరిచ్చిన. మూతి తూడ్సుకొని మల్ల రొట్టెత్తుకొని నడ్సుడు సుర్వు జేసిన. జెర దూరం నడిసినంక మామిల్లోల్ల అంతుమామ ఎడ్లను మేపుకొని అడ్డమొచ్చిండు. 'నీవేనా కోడలో మీ యప్పకు రొట్టె తీసుపోతున్నవా ఆహా! మొగులు మీద గద్ద కోడిపిల్ల నెత్తుక పోతున్నది జూడు' అన్నడు. నీ మామను వట్కనె

వడేతు. జూటమాట్లు జెప్తున్నడు ఇట్లంటరని మాయమ్మ నాకు ముందే జెప్పింది. గందుకనే నేను మీదికి జూడలేదు సటసటా నడిసిన.

రొట్టెల్ల అయింది. 'మాయప్ప ఆకలిగొని మొఖం ఇంటొంక వెట్టెనేమో'..అన్న మాయమ్మ మాటలు యాదికొచ్చినయి. ఇంక జెర బడబడ నడిసిన. సేనికి జేరిన. మాయప్ప ఇంకా అర్కనే ఇడ్వలేదు. ఇంకా సేను రొప్పుతూనే ఉన్నడు. నన్నుజూసి అర్కెడ్లను ఆనవట్టి గుంట్కను నిలవెట్టిండు. ఒక్క అంజల ఒరం మీదికి ఒచ్చి నా నెత్తి మీది రొట్టెల మూటను, సేతులున్న సల్లసెంబును తీసి కింద వెట్టిండు."మాయమ్మ సరిగ్గా రొట్టెలు తినేయాలకు రొట్టె దెచ్చిందిరో" అని సంబరపడ్డడు. వెంటనే కోపం తెచ్చుకొని "మీయమ్మ తీస్కరాక నీతోవంపిందేంరా అదీ!" అన్నడు.

"మాయమ్మనే ఒచ్చేది కాని గుత్తల్ల కూలి ఆఖరి దినం: ఈపొద్దు కూలి పైసలిస్తరంట. ఆల్లంత జెప్పుతుంటె విని నేనే తయారై రొట్టె తీసుకొచ్చిన. అట్లనే మన సేన్ను జూతమని" అని వెంటనే బదులిచ్చిన. కండ్లుపెద్దవి జేసి సంబరంతో నన్ను జూసి "మాయమ్మ నెత్తిపెద్దది, గుండెపెద్దది మాయవ్వలాక" అని పోల్చుకున్నడు. ఇద్దరం తిన్నం.

'ఈన్నే సెట్టుకింద గూసో కొడుక' అని జెప్పి మాయప్ప మల్ల అర్కగట్టిండు.

'మాగిపొద్దు బుర్రున మూకుతది. ఈ పొద్దు నడిం ఒరం దాటకొడితె రేపు మద్ది సెట్టున్న బిల్లల ఆర్కకడ్త' అనుకుంట మయప్ప రొప్పుతుంటె సెట్టు కింద కూసున్న నాకు సరిగ్గా కనవడకొచ్చింది. అంతట్లనే "శామమ్మో....... ఇక్కడరారా' అని లాసిగ పిల్సిండు. దగ్గరుండి ఎట్లరొప్పుతున్నడో సూడొచ్చునని ఉర్కిన.

'అరే.. గుంటుకుకొయ్యలు భూమిలకు సరిగ్గ దిగకొచ్చినయి. రాయి బరువు పెట్టినగాని సరిగ్గ పొందకొచ్చె, మాయమ్మగద గుంటుకు కొయ్యలు గట్టిగ వట్టుకొని కూసో ల్యాగ' అని బత్మిలాడినట్లు అడిగిండు మాయప్ప. మహాసంబురంగా ఒప్పుకున్న. ఇగ లంగను గోసివోసిన. రొండు జడలను ఎంటుకు మడ్సి కల్పికట్టి గుంట్కమీద కూసున్న. గిప్పుడు భూమిలోపలికి దిగే గుంట్కకొయ్యలు నాకు నిద్ద కనిపిస్తున్నయి. నా బరువుకు గుంట్క కొయ్యలు ఇంకొంత లోపలికి దిగుతున్నయి. భూమి లోపలి నీటి పదను గుంట్క కొయ్యలకు తల్గి మెత్తటి పచ్చిమన్ను కమ్మటి వాసనతో వెచ్చగా పైకి పొంగుతున్నట్లె ఎగిసిపడుతున్నది. అయ్యో మన్నుమీద మొలిసిన గడ్డి మొల్కలు వేర్లతో సహ పెకిలి పోతున్నవి నాకు భాదకలగకొచ్చె. పంటమొక్కలు నాటనీకె, అవి నెగలనీకెనే గదా గడ్డి మొల్కలను తీసేసేది అనుకున్న. ' అర్రేయ్ కిందికొంగి సూడకురా కండ్లల్ల మన్నుజిట్లగల్ల' అని బెదిరించినట్లే మాయప్ప అనేవరకు మనాదినుండి బయటవడి తల పైకి లేపి ముందుకు సూడవట్టిన. కొంత సేపటికి గుంత భూమి ఒయ్యి గడ్డ భూమి వచ్చింది.

'ఇగ బరువు అవసరం లేదు. నీవు దిగి మద్ది సెట్టు నీడకు కూసోపోరా' అంటే దిగి గోసిడిసి సెట్టుకిందికి పొయ్యి కూసున్న.

ఇంక జూస్కోగాలిలో ఒక్కొక్కదిక్కు నుండి ఒక్కొక్క కమ్మటి వాసనలు వస్తున్నయి. ఎడ్మబందుకు కాతకు సిద్దంగా కొమ్మల నిండ పూతతో కందిసేను ముదురాకుపచ్చగా నిగనిగలాడుతున్నది. పచ్చి కందికాయ పూత వాసనను గాలితొ నా దగ్గరకు పంపుతున్నది. కుడి బందుకేమొ పొట్టతో ఉన్న పచ్చజొన్న

సేను నిండా సరసరా చిత్ర విచిత్ర ధ్వనులతో ఆకులను ఊపుతున్నది. పచ్చికాపిల్ల వాసనను పంపుతున్నది. నేను వాటిని పసిగట్టి వాసనను పీల్చుకుంట మెల్లగ జొన్నసేండ్లకు పోయిన. జొన్న ఆకుల మీదున్న జొన్న జిగి ఒక్కొక్క దగ్గర ఒక్కొక్క రకంగా కనిపిస్తున్నది. ఇంకేం నన్ను తన దగ్గరకి పిలుస్తున్నట్లే వెళ్ళి చూసిన. కొన్ని ఆకులమీద తియ్యగా చక్కెర రాల్లలాగ, ఇంకొన్ని ఆకుల మీద ఎండపొడుపుకు దగదగ మెరుస్తున్న చక్కెర రాల్లు వజ్రాల్లా తలుక్కుమంటున్నయి. కనిపించిన జొన్నజిగినంతా వదలకుండ తినుడు మొదలువెట్టిన. నీల్ల లాగున్న జిగి చేతికి అందకపోవడంతో ఆకులకు నాలుక వెట్టి నాకిన. అట్ల సాలుసాలుకు మునుం బట్టి దేవులాడి మరీ తిన్న. అట్లా తినుకుంట నాకుతూపోయిన. ఆరుచిలో ఎంతసేపు అయిందో మర్చేపోయిన. నడినెత్తి పొద్దు కిందికి దిగింది. 'శామమ్మో..... అన్న మయప్ప పిలుపుకి జొన్నసేండ్లకెంచి ఒక్క గంతుల ఒరంమీద నిలవడ్డ

'ఎందేప్ప ఇక్కడున్న' అని సెప్పిన.

'ఏంజేస్తున్నవురా జొన్నజిగి నాకుతున్నావ్ నాలుక వగులుతది. రొట్టెతిననియ్యది కారమంటితే మండుతది బిడ్డ జొన్నాకులు నాలుకను కోస్తయ్ ఫైలం' అని జెప్పిండు. ఈ సంగతి నాకు ఎరికే కని కమ్మగున్నదికదా! ఒదలబుద్దికాలే అని మనుసులో అనుకున్న.

'నేను సీకటి వడ్డదాకుండి గుంట్కు గొట్టి మద్ది బిల్ల పొతం జేస్త ఎలుగుండంగనే నీవెల్లుకొడుక' ని మయప్ప కాలిగైన రొట్టెగిన్నెలు అన్ని ఒక్కదగ్గర సర్ది మూటగట్టి నానెత్తిమీదపెట్టి ఫైలంగ ఎట్ల పోవాల్నో ఇగురం జెప్పిండు. ఎడ్లకాడి పిల్లలు సడాక్ నిండ పోతుంటే వాల్లెంబడి ఇంటికి జేరిన. గుత్తల పని ముందే ఒడిసినట్లున్నది. మయమ్మ పొద్దు మూకకముందే ఇంటి కొచ్చి నాకోసం తొవ్వలకడ్డమొచ్చింది. నెత్తిమీద కాలి సద్దిమూటను తీసుకొని, ఎట్లెట్ల పోయిననో అడిగింది.

'నిన్ను పంపినందుకు మీ యప్ప నన్ను తిట్టెనా' అని అడిగింది.

'లేదేమ్మ తిట్టలేదు. నేను జెప్పిన గదా ఈ పొద్దు ఆఖరి కూలి పనికి పోతవని ఏమి అనలేదు' అన్న.

'మాయమ్మకు అన్ని మైయమ్మ లెక్కలే' అని రెండు సేతులు నా చెంపలనద్దుకొని అక్కెర తీసుకున్నది. మయమ్మ చేతివేల్లన్ని ఫటఫటా సప్పుడొచ్చినయి. మాయమ్మ పానమంత నా మీదనే అని యమ సంబరపడ్డది. సొమ్మసిల్లి నందుకేమో జెల్దిన నిద్రపోయిన. మైయమ్మ లేపి రొట్టెతినవెట్టింది కూడా సరిగ్గా ఎరుకలే.

o o o o o

ఇంకా కోడికూయలేదు. మైయమ్మ నన్ను లేపవట్టింది. జెల్దిన్నే లేసిన. బయిటికి తీసుకుపోయి బొగ్గును కడిగి నా చేతికిచ్చింది. 'సటసటా పండ్లు తోమి ముఖం కడ్కో జెడలేస్త' అన్నది. ఎందుకో నాకు ఏం సమజి కాలే. ' 'ఎందుకే నన్ను ఇప్పుడు లేపినవు' అడిగిన 'లాసిగా మాట్లాడకు' అన్నది. మైయమ్మ అట్ల చెప్పెటాల్లకు నాకు జెర బుగులై నిద్ర మబ్బు నుండి పూరా తేరుకున్న. సటసట ముఖం కడిగి ఇంట్లకొచ్చి చూస్తె మాయప్ప ఎప్పుడో లేసిండు. కొటింట్ల పెట్టెల ఏవో కాయతాలు, బట్టలు సగవెడ్తున్నడు. నేను ఏం మాట్లాడకుండ పొయికాడున్న మాయమ్మ దగ్గరకు పోయిన. ఒస్తివా మాయమ్మ అని పొయికింద కొరకాసులు లోపలికి

ఎగనూకుకుంటనే జెడలిప్పమన్నది. ఎందుకో ఈ హడావిడి అన్నట్లు మల్ల మైయమ్మ మొఖం జూసిన. నన్ను సంజాయిస్తున్నట్లు నెత్తి ఊపింది. అయితాయె అన్నట్లు నేను నెత్తి ఊపిన. రొట్టె సద్ది కట్టుడు అయిపోయినంక నాకు జెడలేయవట్టింది. 'బారెడు బారెడు ఎంటికలు దినాం ఎట్ల దువ్వుకుంటదో ఏమో పిల్లకెంత తిప్పలైతదో' అని గుణిగింది.

'వేరే పిల్లలతో కొట్లాడకు, అందరితో దోస్తాన్ జెయ్యి ఒకరికొకరు జెడలు వేసుకోండ' ని జెప్పింది. అప్పుడు తెలిసింది నేను హాస్టలుకు చదవనీకే తాండూరు పోతున్నానని.

'నేనుపోనీకింక రెండు నెల్ల దినముండె గదనే ఇప్పుడే ఎట్లపోవాలె' అని అడిగిన. అప్పుడే మా సంగవ్వ లేపినట్లే నిద్రలేసి మాట్లాడ వట్టింది. 'ఆల్లకు గత్తర్రాను, ఆల్ల మొలతాల్లు తెగి మోతుకుసెట్టుమీద వడ, ఆల్ల గుద్దనోరిడ. మామీద కన్నువెట్టింద్రు, ఎవడో ఎనుకటికి వెట్టింద్రంట, అదిప్పుడు మేం జెయ్యాల్నంట అది దేవుడే వెట్టిండంట, ఆ దేవునింట్ల ఎత్తి ఏడు దోసిల్ల మన్నుబొయ్య, ఆదేవునికి సాలులేదా, మేంఏం పాపం జేసినం, నాపిల్ల జిందగిని పాడు జెయ్యనీకె యమినోల్ల తీరుగ ఎగవడ్డరు' అనుకుంట కుమిలి కుమిలి ఏడ్వవట్టింది. మాయమ్మ గప్పున మా సంగవ్వ దగ్గరికి పోయి రెండు బుజాలు గట్టిగ వట్టుకొని 'ఇది ఏడిసె సమెముకాదు. నీవిట్ల గట్టిగ ఏడిస్తె మందింటరు. ఆనోట ఈనోట వడి పెద్దోల్లదాక వోతది. ఆల్లకు తెలిసిందంటె తండ్రి బిడ్డ ఊరుదాటుడు కాదు. ఏడ్వకు మైయమ్మగద జెర మనుసు గట్టిగ జేసుకో గదా' అన్నది. 'ఎందుకేమ్మ ఏడుస్తవ్! మనదేవుడు మనెంబడే ఉన్నడు. ఎంతదాక శాతనైతే అంతదాక వోదం గాని నాపిల్లను సెరలవెట్టను. అయితాయెనా' అన్నడు మయప్ప. సంగవ్వ ఒక్కసారి నెత్తి మీదికి లేపి మమ్ముల జూసింది. ఎర్రగా సింతనిపుకలోలే మెరుస్తున్న కండ్లను తూడ్సుకుంట 'గంతెకొడుక నాబొడ్డుకాడి మాటజెప్పితివి. మనకాందాన్‌కు ఈ పని ఎర్కలేదు. మాయమ్మ మా అవ్వ, మునవ్వలు ఎవ్వంతోని గింత ఏలెత్తి సూపెట్టించుకొనలే. ఆల్లు ఎంత బలిమి జేసిన ఈ పనికి తలొంచకు. ఆఖర్కి నీమెడ మీద కత్తి వెట్టినా నీమాట మీద నీవుండాలె కాందాన్ ఇజ్జత్ నిలవెట్టాలె కొడుక' అన్నది.

ఈ రస రస ఏందో ఒక్కటీ మేల్తమైతలేదు. ఇప్పుడడుగుదమంటె మనసొప్పకొచ్చింది. మెల్లెగ అదే తెలుస్తది అనుకున్న కని మనసు ఆగకొచ్చింది. వాళ్ళ మాట్లను ఇనుకుంట ఉన్న గంతె. కాని నాగురించి ఊర్లో ఏమో అనుకుంటున్నరు. అది పెద్ద పరిక్కంపనే ఉన్నట్లున్నది. గందుకె మావోళ్ళు గింతగానం దడ్సుకుంటున్నరని మాత్రం మేల్తమయింది.

'ఇదంత అంగలార్సుకుంట కూసుంటే తెల్లార్తతది. జెల్ది బయట వడుండి' అన్నది మైయమ్మ. ఉతికిపెట్టిన మైయప్ప తెల్లపంజ, అంగి తొడుక్కున్నడు. పొడుంగీతల రుమాలి, నల్లగొంగడి బుజంమీదేసుకున్నడు. ఒక సేతుల బస్త, ఇంకో సేతుల గెంట్లకట్టె పట్టుకున్నడు. మేం పొయ్యేముందల మయప్ప సంగవ్వ కాళ్ళు మొక్కిండు. నన్నూ మొక్క మన్నడు. నేను ఒంగి సంగవ్వ కాల్లమీద వడిన. 'సల్లగ వొయ్యిరండి కొడుక పొయిన పని నిద్దగావాలె దేవుడా' అని నన్ను దీవించుకుంటనే దేవునికి మొక్కింది. మైయమ్మనేమో మాతమ్మున్ని, మాయన్నను నిద్రలేపి 'సెల్లెలు హాస్టలుకు పోతున్నది, సాగనంపుదురు లేవుండి కొడుక' అని వాల్లను నిద్రనుండి లేపి మరీ నాకాళ్ళు మొక్కిచ్చింది. మాకు 'జతునం' అని చెప్పి సాగనంపింద్రు.

ఇక సలి సప్పుడు లేకుండా కేరి, వాడ, ఊరు నుండి బయట వడినం. అప్పుడు మూడు జాముల రాతిరి అయింది. ఇంకా పొద్దు సుక్కవొడ్వలేదు, గొర్తికొయ్యలు ఇంకా సెక్కుజెదరలేదు. పండోలె వెన్నెల కాస్తున్నందున తొవ్వ బాగానే కనిపిస్తున్నది. మైయప్ప ముందల, ముందల పోతున్నడు. నేను వెంట వెంట నడుస్తున్న. లేదు మాయప్ప నడుస్తున్నడు. నేను ఉర్కుతున్న. అవి దారులు కావు. వరిసేన్లల్ల సన్న సన్న ఒరాలు పచ్చి పచ్చిగ బుర్ద బుర్దగ ఉన్నాయి. నారుమడుల్ల కప్పలు సందువోకుండా బెక బెక మంటున్నయి. మేం నడుస్తుంటె ఒరాల మీదున్న కప్పలు, నీరుకట్టెపాములు వరి బందాలల్లకు దుంకుతున్నయి. మేము తెల్లారెటాల్లకు ఊరి పొలిమెరను దాటాలె, మంబపూరు తామర పూల చెరువును దాటి కిలోమీటరుదూరం నడ్వాలె. గప్పుడే తాండూరుకు పొయ్యే బస్సును అందుకుంటం. సటా సట నడుస్తూనే ఉన్నం. మద్య మద్యన తగిలే నీటి కాల్వలను మైయప్ప ముందు బారెడు అంజతోదుంకుతున్నడు. ఎంటకెల్లి నా చేయిని పట్టుకొని దాటించుకుంట పైలం కొడుక, బద్రంకొడుక అని జెపుతున్నడు. మొత్తానికి బసొచ్చె యాల్లకు సడాక్కు చేరుకున్నం

పిల్లలందరు పొద్దటి పూట నాస్త తిననీకె గిన్నెలువట్టుకొని సాలుకట్టి నిలబడ్డరు. వార్డెనమ్మ రానీకె ఇంక సమయం పడుతదన్న సంగతిని పిల్లలనడిగి తెలుసుకున్నడు మైయప్ప.

హస్టలు పక్కకున్న యాపసెట్టు కింద కూసొని తెచ్చుకున్న సద్దినిప్పి తిన్నం. అంతట్లనే వార్డనమ్మ వచ్చింది. మైయప్ప ఆమె కూర్చున్న కుర్చి దగ్గరికెల్లి ఒంగి రెండుకాల్లమీదవడి మొక్కవట్టిండు. 'అయ్యయ్యో ఎందుకిట్ల మొక్కుతున్నవయ్యా ఏమిటో చెప్పు' అని అడిగింది.

'అమ్మా గిప్పుడు మమ్ముల నీవే ఆదుకోవాలె, నా బిడ్డకు తండ్రి తల్లివి నీవే. మేం ఆమెను కన్నం గాని ఆమె నశీబును కనలేదమ్మా. ఇప్పుడు మమ్ముల కనికరిస్తేనే నాబిడ్డ బతుకు నిలవడ్తది తల్లీ.... అంతా నీ సేతులనే ఉన్నదమ్మా. ఇంతకు ముందు మీది నుండి పేరు రానీకె రెండునెల్ల సమయం పడుతది అన్నరు. కాని ఇప్పుడు ఊర్ల ఉండి పేరొచ్చినప్పుడు రానీకె మాకు సందులేదు. మేం ఉందమనే ఉన్నం గదమ్మా కాని మావూర్ల పటేండ్లు అంతాకూడి నా బిడ్డను జోగిన్ని చేయాలనే పాపపు నిర్ణయం జేసిండ్రు. నేను నా బిడ్డను చదువుకు పంపుతున్న సంగతి తెలిసి నన్ను పిలిసిండ్రమ్మా' ఏమన్న గానీ అని వాళ్ళకెవరికీ చెప్పకుండ నాబిడ్డను తీసుకొని ఇక్కడొచ్చిన తల్లీ ' అని మా ఊర్ల జరిగింది జరిగినట్లు పూసగుచ్చినట్లు సెప్పుకొచ్చిండు మయప్ప.

o o o o o

'ఒరి బాలిగా నీ బిడ్డను చదువుకెందుకేస్తున్నవురా ఊరి పద్దతి నీకు తెలవదారా రేపటినాటికి ఊరికి ఏమన్న కీడు అయితె ఎట్లరా? ఎనుకటి నుండి నడుస్తున్న సిరాస్త, ఆచారంను, నడుమంత్రాన ఆపితె ఎట్లరా అన్నడు పటేలు.

' పటేలా మీకు తెలవందేమున్నది నాకున్న ఒక్క బిడ్డ జోగిన్ని జేస్తే ఆమె జిందగి నిలవడది. మన సుట్టుపక్క ఊర్ల మాల మాదిగ పోరగాల్లనందర్ని బడికి పంపుతున్నరు. అయినా నేను పెద్ద మొగ పోరగాల్ల

నిద్దర్ని జీతంలనే ఉంచితి. గీమెనన్న సదువుకు వంపుదమని సోచాయిస్తున్న' అన్నడంట అంతే దొర మొఖం కళ్లు ఎర్రగ జేసుకొని 'మేం చెప్పేది నీతో ఇవన్ని సంగతులు వినడానికారా? ముందు నీ బిడ్డను జోగిన్ని జేస్తవా లేదా? అదొక్కటి చెప్పు చాలు. ఈ ఊర్ల మేం చెప్పినమంటేనే ఇది ఊరు మాట. ఊరు మంచికోసం చెప్తుతున్నం. రేపటినాటికి మనూర్ల మనుషుల, పశువుల సావులు జరగొచ్చు, రోగాలు రావచ్చు, పంటలు పండక పోవచ్చు, కరువు రావచ్చు, అప్పుడు ఏం శాంతిజేస్తే ఏమున్నది.

ముందు మనం సరిగ్గా వుంటే దేవుడు మనల సక్కగ జూస్తడు. రేపటి ఊరడమ్మ పండగకు రంగమెవ్వరెక్కుతరు? పోలెపల్లిలో 'సిడె' ఎవరు కడ్తరు? మనూర్ల జోగుకిడిసిన లస్మి ముసల్దయింది. దానికి కొలుపు జెప్ప నుడుగులు డొల్లకొచ్చినయి. ఊర్ల శానామందికి అమ్మవారు పోసినప్పుడు ఊరడమ్మకు జీవులను, దున్నపోతులను కోసి పెద్ద పచ్చితునకను జోగిని నోటిల వేలాడదీసి ఊరుచుట్టు దిప్పాలంటే ఏడ సాద్యపడ్డది. ఈ ముసల్దాని కాళ్ళు సుట్టుకపోయి వరిబందాలల్ల దిమ్మరపోయిపడ్డది.

రంగమెక్కనీకె ముందు దినం నుండే ఉపవాసముండాలె. ఊరడమ్మకాడ పచ్చికుండమీదెక్కి నిలవడి రంగమెక్కి కొలుపు జెప్పాలంటే అట్లట్లనే ఆయె. ఇగ 'శిడ' ఎక్కాలంటె ఈ ముసల్దాని తరమయితదా? యాడయితది. పడుసుపోరీలె ఆగం గావట్టిరి. ఇదంత గాదురా ఇంకో పిల్లను జోగుకిడ్వాలె. ఇప్పుడే జోగు లస్మి బతికుండంగనే కొలుపు, పాటలు, పద్యాలు, నుడుగులు, కొల్పు జెప్పియ్యాలె. ఈ కార్యం ఎంతజెల్ది జర్గితె అంత మంచిదిరా...? రేపటినాటికి ఈ ఊరికి కీడు జరిగితే ఎట్లా? కీడు జరగకుండా చూసేబాధ్యత మనమీద లేదా? మీరు జూడాడలె, మేము జూడాలే. అట్ల చూడకుంట సదువుకు వంపుత అంటే ఎట్లరా? నీవు జెయ్యాల్సిన పని నీవు జెయ్యకుంటె, నేను జెయ్యాల్సినపని నేను జెయ్యకుంటె పాపం తగుల్తది. ఎవని నొసట ఏది రాసి వుంటె అది అయితది. మద్యల మన మెవరంరా మార్చనీకె. చేతివేళ్ళన్ని ఒక్కంతకులేని సంగతి ఎరుకెకదరా!' అన్నడమ్మా మేం ఓ పూట తిని ఓ పూట తినక కడుపు కట్టుకొని పిల్లల పెంచుతున్నం. ఈ ఈ పిల్లలకు వెట్టి బతుకు వద్దనే ఈ సదువుకు పంపుతున్న. మాకన్న పేగును సూత్త సూత్త ఊరుమీద జోగినీకి ఎట్ల ఇడుస్త. కడుపుల ఎంతో మసులుతున్నది. సావకుండ బతుకకుండ ఉన్నది మా బతుకు. అని కడుపులో నుండి తన్ను కొచ్చిన దుఃఖం వల్ల మా అప్పకు గొంతు నుండి మాట పైకి రాకొచ్చింది. బిలబిల ఏడుపు తప్ప. ఆ స్థితిలో మైయప్ప ఏడవడంను చూడడం నేను తట్టుకోలేకుండున్న. ఊరుకంత కావాల్సిన ఊరజెర్వె ఏడుస్తున్నట్లు మాదిగోల్ల లందకాడ వేపచెట్టు ఏడుస్తున్నట్లున్నది. మాయప్పను గట్టిగ వట్టుకొని ఏడ్వడం తప్ప ఏం చేయలేక పోయిన. ఒకటే ఏడ్పుడు. మాయప్ప ఏడ్పుడు నేను ఏడ్పుడు, ఇది చూసిన వాడనమ్మ కండ్లల్ల నీల్లు తిరిగినయి. ఆమెకండ్లు తూడ్చుకొని 'అమ్మాయి భయపడుతుంది. నీవేడ్వకు బాలయ్య, నీవు చేసే ప్రయత్నం చాలా మంచిది. నీ మాట మీద నీవుండు' అని చెప్పింది. 'అమ్మా. నా బిడ్డ చదివి పెద్దగయితె ఏమయితదో ఎవరికెరుక? ఏమన్న గానీ చదువుకున్నంక తన తెలివి, తనమాట, తన జిందగీ ఏమన్న గాని గిప్పుడైతె హాస్టల్ల జేర్చుకో తల్లీ' అని మల్ల కాల్ల మీద వడ్డడు. వార్డనమ్మ అంత విన్నతర్వాత గవర్నమెంటు జోగిని పద్ధతిని నిషేధించి ఎంతో కాలమైంది వాల్లకు తెలియదా! మూర్ఖుల్లా ప్రవర్తిస్తున్నారెందుకు? సరే బాలయ్య అమ్మాయిని హాస్టల్లో చేరుంచకుంటాను, స్కూలుకు

పంపుతాను. నీవు వెల్లి నిశ్చింతగా ఉండు. వాల్లు మరో మారు 'నీ బిడ్డను ఆస్టలు నుండి తీసుకురా జోగినికేద్దాం' అన్నరనుకో నీవు సక్కగా ఇక్కడికొచ్చెయ్ వాల్లమీద పోలీసు కంప్లేంటు ఇద్దాం, నీవొచ్చెయ్ సరేనా' అని సలహ ఇచ్చింది వార్డెనమ్మ.

'అయితాయెనమ్మా నీసహాయం నేను ఉంచుకోనమ్మా మీయింటి ముందు జీతముండయినా తీర్సుకుంట. జీతగాల్లు గావాలంటే చెప్పమ్మా నేనే ఉంట. లేదంటే ఎన్ని దినాలయితే అన్ని దినాలుండి మీ భూమి దున్నె పనిచేసి పోత. ఇంతట్లయితే రెండు బండ్ల సొప్ప అయితే తీసుకొచ్చి ఏస్త. పాలిచ్చే బర్లు వున్నయి గదమ్మ మీదగ్గర ఎంత మేత ఉన్నా వాటికి సాలది' అన్నడు ఆ..సరే సొప్పయితే తీసుకురా అన్నది వార్డనమ్మ. మల్లోసారి మా అప్ప నడుం మొత్తం వంచి వార్డనమ్మకు దండం పెట్టిండు. వార్డనమ్మ రిజిస్టర్ పనిలో మునిగిపోయింది. ఇగ మైయప్ప బయిటికొచ్చిండు. నేనూ మా అప్ప ఎంబడే వచ్చిన. నా నెత్తి మీద చెయ్యిపెట్టి ' మాయమ్మ నసీవుమంతురాలు' అనుకుంట మంచిగ 'సదువుకో బేట జతునం, నేను వోత మల్ల నేను పొద్దుమూకెటికల్ల పటేండ్ల కంట్లెవడాలె' ' అని జెప్పి గొంగడి బుజంమీదేసుకొని నెత్తికి రుమాలి కట్టుకొని బిరా బిరా మైయప్ప వోతుంటె అట్లనే చూసుకుంట నిలవడిన.

నాతో ఎప్పుడెప్పుడు మాటకలుపాలని ఎదురు చూసుకుంట జెర్రదూరంలో నిలబడ్డ ముగ్గురమ్మాయిలు నాదగ్గరకొచ్చింర్రు. నేను వాల్లతో కలిసిపోయిన. పగలంత ఆటపాటలతో చదువుతో గడిచిపోయేది. రాత్రికి అమ్మ, తమ్ముడు, అవ్వ అన్న, అప్ప యాదికొచ్చేది. ఒంటరిగ నిద్రబోయే అలవాటు లేదు. మా అమ్మ కడుపుల వెచ్చగ పడుకొనేది. ఒంటికొస్తె మైయమ్మ లేచేది. సంగవ్వ, లసుమవ్వలేమో మస్తు కథలు చెప్పేది. రాతిరి అన్నాలు తిన్నంక ఆరుబయట పడుకున్నప్పుడు మొగులు మీద చుక్కలను లెక్కవెట్టేది. చుక్కల్లో గొర్తికొయ్యలు, బంగారు పట్టెమంచం కుక్క దొంగలు, పిల్లలకోడి, తేలు కథలు జోరుగానే నడిచేవి.

హాస్టల్లో సాయంత్రం అన్నాలు తిన్నాక ఎవ్వరికొచ్చే కథలు వాళ్లు చెప్పుకునేది. మాయవ్వోల్లు చెప్పిన కథలన్నింటినీ నేను నా తోటి పిల్లలకు చెప్పేది. కొంతసేపు చదువుకొని, బిస్తర్లు పర్సుకొని ఆడికీడికీ సాలు గా పడుకొనేది. వాచ్‌మెన్ వచ్చి 'అందరూ నిద్రపోండి' అన్నవెంటనే నిండ దుప్పటి కప్పుకునేది కాని నిద్ర పోకపొయ్యేది. ఇంటికాడి సంగతులన్ని మనుసులకు వచ్చేవి. ఒక్కసారే వీపుల జర్సుకుంట కడుపుల బుగులు జొచ్చేది. అది ఊర్ల మాయప్పను పటేండ్లు ఏమన్నరో, ఏమైయిందో కొట్టిరో తిట్టిరో ఏమవస్త వెడుతున్నరో మైయమ్మ, సంగవ్వ, తమ్ముడు, అన్న ఎంతేడుస్తున్నరో అని దేవులాడుకునేది అట్ల యాదికి చేసుకుంటే నాకు ఏడుపొచ్చేది. ఎప్పుడు నిద్ర పోయేదాన్నో నాకే తెలువదు. నిద్రలోకూడా పీడకలలొచ్చి దిగ్గున లేసి కూసునేది. మావోల్ల మీద పానంబడ్డది. ఒక్కసారి అందరినీ చూడాలనిపిస్తున్నది. తెల్లవారి ' ఏంటమ్మాయి జ్వరమేమన్న వచ్చిందా? ముఖం అంతా నీరసంగ ఉంది. కళ్ళు ఎర్రగయినయి.' అని హాస్టల్లో వంటజేసేటామె అడిగింది. నేనే బదులు చెప్పలేదు. ఏం చెప్పాలో తెలువక ఏంకాలేదని నెత్తి ఊపిన. కాని కడుపులకెల్లి ఏడుపు తన్నుకొస్తున్నది. ఏడిస్తే ఇంటికాడ పానం పెట్టినని ఇంటికి పంపియ్యగల్ల అనే బుగులుతో దుఖాన్ని దిగమింగుకున్న. అంతట్లనే 'అమ్మనాయిన యాదికొస్తున్నరా? ఇంక రొండు దినాలైతె

నాలుగు దినాల సెలవులు వస్తున్నయి. అందరూ ఇండ్లల్లకు పొయ్యొస్తరు. నీవు పోదువు రందెందుకు పిల్లా' అన్నది. ఈ ఇగురం బాగనే ఉన్నదనిపించింది. ఇగ మాఇంటికి పోయ్యేరోజున నిన్న వేసుకున్న జడలకు రిబ్బన్లు మాత్రమే ఇప్పిన, మీద మీద దువ్వి ఇడిసిన పాతజడలనే మడిసి కట్టుకున్న. అన్ని పనులు బరబరా చేసుకొని పిల్లలతో పాటు బడికెల్లిన. పొద్దుమూకి బడిగంట కొట్టినంక మా అన్న గోటీలాడి గెల్సుకొని దాసుకొమ్మని నాకిచ్చిన చిల్లర పైసలు లంగజేబిలేసుకున్న బస్సు కిరాయికని. హాస్టల్లిచ్చిన కొత్త పుస్తకాలన్ని మైయప్పకు జూపియ్యనీకే బస్తల సర్దుకొన్న. మెడకు పక్కపొంటి పుస్తకాల బస్తను వేలాడేసుకొని బసెక్కి ఇంటికి బైలెల్లిన.

o o o o o

'మాగమాసం జొన్నసేన్లు పొట్టకొచ్చినయి. కంకులు పొట్టలు విప్పుకొని ఎప్పుడు బయిటికొస్తయా పొడ్సుకొని తిందం అన్నట్లు సేన్ల మద్యలకేంచి దంట్లసుట్టు, చేనుసుట్టు పిట్టలు గిరికీలు కొడుతున్నయి. ఇప్పుడు కాదులే జొన్నదంట్లు ఈననీకె ఇంక సమయం ఉన్నదన్నట్లు దీమాగా కాకులు గుంపులు గుంపులుగా జొన్న చేసు మీదుగా ఎగురుకుంటు పోతున్నయి. కాని పిట్టల్లా గిరికీలు కొట్టల్లేదు. సేను ఈని జొన్న కంకులు బయట వడ్డంక ఉన్నది అసలు తిప్పలు. ఈ రెండు దినాలల్లనే సేను నడుమ మంచె వెయాలె. ముందే సేను సడాక్ పక్కపొంటి ఉన్నది. సేండ్లనేమో దోస తీగలు దండిగ పడ్డయి. దూల్లకాడి పోరలు పుట్ట పండ్లకెగవడుతరు. జొన్న దంట్లు ఇరిగెటట్లు సేన్లనుండి ఉర్కుతరు. అట్టిట్లవడి మంది పాలకంకుల కాపిల్లకోసం జూస్తరు. అందుకే కావలుండి కనిపెట్టుకొని ఓమనిషి సేనొంకలనే ఉండాలె. ఇగ మా సంగవ్వకు రొండు నెలలదాక పెద్ద కొలువు. సేనుకాడనే రాత్రి పగలు ఉండాలె. ఇంటి నుండి ఎవరో ఒగరు రొట్టె సద్ది తీస్కపోవల్సిందే.

"పొద్దెక్కుతనే ఉన్నది. ఎలుగుండంగనే జెల్దినవొయ్యి మంచెకు కట్టెలు సుదురాయించు కొడుక బాలప్ప". అని మయవ్వ చెప్పుకుంట శాటకొయ్యలు తీసుకొని పోవట్టింది.

"అయితాయెనేమ్మ మంచెకు అడ్డం పేర్సె వాసాలున్నయి గాని భూమిల పాతే నాలుగు గుంజలు లేవు. వాటిన్నెంకులాడాలె. సిన్నాడ్క సేను ఒరంపొంటి మన తుమ్మసెట్లున్నయి దానికి రెండు వాసాలు కొడుత ఇంకేంది" అనుకుంట గొడ్డలి సిప్ప బుజంమీద వెట్టుకొని రుమాలి కొంగుల మయమ్మ కట్టిచ్చిన రొట్టెసద్ది కట్టుకొని బైలెల్లిండు. ఊరు ఇంకా దాట లేదు. పటేల్ జీతగాడు అడ్డమొచ్చిండు. అతన్ని చూసి కడ్పుల గుండెల్ల గుబులు జొచ్చింది. కాని అంతా మామూలుగా ఉన్నట్లు ఏమి జరగనట్లు ఉండే ప్రయత్నం చేసిండు మైయప్ప. లోపల మాత్రం సిత్తడి సిత్తడిగా, గాలి గాలిగా ఉన్నా మనిషి మామూలుగా నడుస్తూనే ఉన్నడు. "పెద్దప్ప నిన్ను పటేల్ రమ్మనెనే" అన్నడు. మాయప్ప గుండెళ్ళో మరొక్కసారి ఝల్లు మన్నది. శామమ్మను చదువుకని హాస్టలుకు పంపినందుకే అన్నది మేల్తమయింది. ఊర్లది ఊర్ల ఎంతకని దాసుకుంటం! ఎన్నటికైనా ఎరకయ్యేదేగదా "ఏం జేస్త యాడికయితే ఆడికి గాని అనుకొనే కదా సదువుకని హాస్టలుకు తోలిన'ని పరిపరి విధాల సోచాయించుకుంటనే కొంతసేపటికి

"ఎందుకు కొడుకా పటేలు రమ్మన్నది" అడిగిండు మయప్ప. జీతగాడు దిగులుగా మొఖం పెట్టి

“ఇంకెందుకే శామమ్మ సాలెగురించె’ అని మరింత ష్పష్టం చేసినట్లు చెప్పి నా పని అయిపోయింది అన్నట్లు వెల్లి పోయిండు. మాయప్పకు ఏం జేయాల్నో పాలుపోకొచ్చింది.

ఎంటకు మల్లి ఊరు దారివట్టిండు. తలారి పెంటప్ప అడ్డమొస్తె “నన్ను పటేల్ రమ్మన్నడంట నేనువోతున్న మాయమ్మకు, మీ సెల్లెలికి జెప్పే భావ’’ అని జెప్పి పటేలింటి బాటవట్టిండు. దారిల ఎదురువడ్డోల్లు మైయప్పను దిగులుగా జూసుడువెట్టింద్రు “అంతా ఆ పరమాత్ముడి దయ’’ అని రెండుసేతులతో పబ్బుతి వట్టి మొగులొంక చూస్తూ మొక్కుతున్నడు. అందరిని కండ్లతోనే పలుకరిస్తున్నట్లు దీనంగా పోవట్టిండు. మొదట మాదిగకేరి దాటి, మాలకేరి దాటి సూదరోళ్ళ బజార్ల నుండి నడుస్తూ నడి ఊర్ల ఉన్న పటేలింటికి పోయిండు. అక్కడ పటేలు ఒక్కడే ఉన్నడనుకున్నడు మాయప్ప. కానీ ఎస్.ఐ రామిరెడ్డి, సర్పంచు అనంత్‌రెడ్డి, మాజి సర్పంచు చెంద్రారెడ్డి, ముకుందం సావుకారి బద్రప్పసేటు, శ్రీరామ్ శర్మ పంతులు వీల్లంత ఏదో మీటింగ్ పెట్టుకొని కనిపించింద్రు. మాయప్పను చూసిన గెటుకాడి వాచ్‌మెనే ఆగు బాలప్ప అయ్యలు మీటింగులున్నరు’ అని గేటుకాడనే ఆపేసిండు.

“దొరనన్ను పిలిపించిండు ఒక్కసారి ఆతని కంట్ల వడనియ్యి మాయప్ప గద, మల్లనేను రాలేదనుకోగల్ల’’ అని బతిమాలి చెప్పిండు.

“నీవు కూర్చో నేను చెప్పుత మద్యలవోతే కోపానికొస్తరు’’ అన్నడు. ఆ మాటతో పెద్దగేటుకు ఓ పక్కకు కూసున్నడు. రెండుగంటల తర్వాత ఒక్కరొక్కరు కొందరు వెల్లిపోయింద్రు. పటేలు చంద్రరెడ్డి అనంతరెడ్డి శ్రీరామ్ శర్మ పంతులు మాత్రమే కూర్చోని ఉన్నరు. వారు మీటింగ్ గది నుండి పటేలు రోజు కూర్చునే గద్దెమీదకొచ్చి కూసున్నరు. అప్పుడు బంటాయన వచ్చి ‘బాలప్ప పటేలు నిన్ను పిలుస్తున్నడు’ అని లోపలికి పంపించిండు. మా యప్ప సటుక్కునలేసి నెత్తి రుమాలుతీసి సేతుల వట్టుకొని సెప్పులు బైటనే వదిలి పెట్టి లోపలకు పోయి “దండం పటేల’’ అన్నడు. వాల్లంతగా పట్టించుకోలే చూసి చూడనట్లే ఉన్నరు. ఏదో మాట్లాడుకుంటున్నరు. మైయప్ప సేతులు కట్టుకొని బుజాలు అన్ని బిగవట్టుకొని నిలబడ్డడు. పటేలు మైప్పను కిందికి మీదికి ఒక్కసారి తేరిపార జూసిండు

“ఎక్కడ పోయినవురా బాలిగా అని అడిగిండు’’

“ఎక్కడ లేదు పటేల జొన్నసేను పిట్టలకొచ్చింది కదా మంచేతమని గుంజలకోసం తుమ్మసెట్లు కొట్టపోతున్నా’’

“ అరే నీకు తెలివి ఎక్కువవు తున్నదిరా నేను ఈ పొద్దుటి సంగతి గాదురా నీ బిడ్డను ఏడవెట్టొచ్చినవురా ’’అని గదమాయించి అడిగిండు.

“ పటేలా నా బిడ్డను’’ అని చెప్పబోయిండో లేదో

“మాటకు మాట సమాధానం జెప్పనేర్చినావురా? మేం జెప్పింది నీ సెవుమీద పేనువారలేదురా? ఏమనుకుంటున్నవ్ నీ మనసుల? నీకు ఊర్ల మంచిగ బతుకాలని లేదా? మేం చిలకకు సెప్పినట్లు జెప్పినం గదరా..,అంత జెప్పంగా కూడా నీ బిడ్డ సదువుకు వంపినవ్ ...యాడ చదువుతదిరా సాకలిండ్లల్లానారా?. నీ బిడ్డను సదువుకు పంపినావంటెనే నీవు ఊరుమాట కాదన్నవ్ ఎరుకేనా? ఎంతదైర్యంరా నీకు’ అని పటే లు

కళ్ళన్నీ ఎర్రగ జేసి తిడుతున్నడు.

"పటేలా పక్కూర్ల మాల మాదిగోల్ల పిల్లలు చదువబోతున్నరని, నా బిడ్డకూడ ఇన్ని అక్షరాలు నేర్చుకుంటదని సాలెకు పంపినం దొర" అంటుండగనే నీకు నోరు పెరిగిందేందిరా? నీకు దైర్యం ఇచ్చినోడు ఎవ్వడురా? అని అనుకుంట ఉగ్రుడై అటు ఇటు ఏం దొర్కుతదా అని చూస్తున్నాడు. పటేలుకు ఏది దొరకక పోయేటాల్లకు తన టేబుల్ మీదున్నపేపర్ వెయిట్‌ను తీసి మయప్ప మొఖానికి విసిరి కొట్టిండు. అది సరిగ్గ మయప్ప పన నుదురుకు బలంగా తాకింది. బలబలా నెత్తురు కారవట్టింది. అయినా మయప్ప అట్లనే నిలవడ్డడు. పటేలు కోపం ఇంకా చల్లారనేలేదు.

"మీ జాతికి ఎంతకొట్టినా భయం లేదురా! ఎంత తిట్టినా సిగ్గు ఎగ్గులేదురా!" అనుకుంట కట్టకింద నిలబడ్డ మైప్పను కట్ట మీదికేంచె ఎదల తన్నిండు. మయప్ప వెనుక వైవున్న గోడకు సాగిలబడ్డడు.

"వాన్నేంగొడుతవ్ ముందు జరగబోయే పని చూడు చంద్రరెడ్డి పటేల్" అని శ్రీరాంశర్మ గుర్తు చేసిండు. "అయినా వీల్లననేం లాభం, ముందు ప్రభుత్వానికి సిగ్గులేదు అందరికి సదువని నాటకాలాడుతున్నది.. అందరు చదివి ఊల్లేలితె  వెట్టినీ, జోగినీ ఎవ్వరు జెయ్యాలనో? ఎవని వృత్తి వానికి ఉండనే ఉండె. మనది గ్రామ రాజ్యం అందుట్ల మంగలోడు, ఒడ్లోడు, సాకలోడు, మాదిగోడు మాలోడు ఎవరి కాయికం వాడు చేయ్యాలె. ఈ జోగిని కాయికం ఈ బాలిగాని బిడ్డనే జెయ్యాలె! ఈ సంగతి ముందే జెప్పినం. విన్నావురా? నీ మొండి పట్టు నీదేరా! అయినా మీకేం తక్కువ జేసిండురా పటేలు. పాపం ఎంత జేసె, ఎంత ఓపికవట్టెగదరా పటేలు". అని శ్రీరామ్ శర్మ బోదజేసిండు.

"వాడినుండి రక్తశ్రావం బాగా జరుగుతుంది. ఎక్కువసేపు ఇక్కడుంటె ఈ జాగ అంతా వాడి రక్తంతో అపవిత్రమైతది. వాడి కేమన్న అయి ప్రాణం పోగల్ల, ఈ సంగతి ఊర్లకు పొక్కగల్ల, ఇక్కడి నుండి త్వరగా తీపించెయ్యి " అని  పురమాయించిండు శ్రీరామ్‌శర్మ. పటేలు జీతగాల్లు ఇద్దరు అగేత్రాన ఉర్కొచ్చి నెత్తురునెత్తురయిన మైయప్పను కాళ్ళొంక ఒకరు, నెత్తొంక ఒకరు పట్టుకొని మోసుపోయి  బయిటేసింద్రు. అప్పటికే కొనా గేటు వాకిలిదగ్గరి కొచ్చి  మైయమ్మ, మైయవ్వ ఎదిరి చూస్తున్నరు.  మా సంగవ్వ  సెంచెత మాదిరిగా హాహా అని నెత్తినోరు మొత్తుకుంట ఉర్కొచ్చి మైయప్పను పట్టుకోని లబోదిబో మొత్తుకున్నది. "ఎన్నో దేవర్లకు మొక్కంగ నీవు వుట్టినవ్ కొడుకా. నిన్నుకొట్టసేతులెట్ల ఒచ్చెరా? చీమకు కూడా హానీ చెయ్యని తండ్రివి, నిన్నుకొట్టనీకే సేతులెట్ల ఒచ్చెరా యా దొంగలు కొట్టిర్రా, ఆల్లసేతులకు కుస్టురోగం రాని. ఆల్లని దొంగలు నరుక" అనుకుంటూనే ఏడ్సుకుంట సుట్టపక్కల దేనికోసమో నెంకుతున్నది. మైయప్ప నెత్తి ఒల్లోబెట్టుకొని చీరకొంగుతో నెత్తికి వడ్డ పొక్కను ఒత్తిపట్టింది. అయినా నెత్తురుకారడం ఆగకొచ్చింది.

"ఇదేం అన్యాలం దేవుడా! మేమేం పాపం జేస్తిమి! మేం బతుకగూడదా దునియల అనుకుంట పటేల్ ఎడ్లకొట్టం ఎనుకంగ ఉన్న నల్లగాయి పాకును బరుక్కొచ్చి గట్టిగ నల్సి నెత్తురొచ్చె గాయంల  పిండింది మాయమ్మ. అయినా నెత్తురు ఆగకొచ్చింది. పసరు పిండి పిండి పిప్పిని గూడా రంద్రంలనే పెట్టింది. సంగవ్వ గట్టిగ వట్టుకున్నది. మైయమ్మ మల్లుర్కి పటేల్ దిడ్డమూతొంక పోయి  "పటేలమ్మా తోడం నీల్లియ్యి.

ఇతనికి తాపుత నెత్తురాగకొచ్చింది’ అన్నదో లేదో “ఇక్కడొచ్చినవేమే నీ మొఖం మండ పటేల్ జూస్తే నన్ను
జంపేస్తడు పో..పో..’’ అని దర్వాజ దన్‌మని మూసుకున్నది. ఒక్కసారి ఎంటకు మల్లి పటేలు ఇంటి పక్కకు
అంత దూరంలో ఉన్న రామ్‌రెడ్డి పటేలింటికెల్లి దిడ్డిమూత దగ్గర నిలవడి “అమ్మా నీకాల్లు మొక్కుత తోడెం
నీల్లియ్యి. నోరెండిపోయి నాలుక ఎండిపోయి పిడ్సగట్టి మాట్లాడకొచ్చె నెత్తురంత కాల్వలాగ పోతున్నది.
జెర్రన్ని నీల్లియ్యమ్మా’ అని బతిమిలాడింది మైయమ్మ

“పటేలు పటేలు అని నెత్తికెక్కించుకుంటిరి గదనే అందరు ఓట్లేసి మా పటేల్‌కెయ్యకపోతిరి అప్పుడు
లేదాయే బుద్ది. గిప్పుడు నీల్లియ్యమనొచ్చినవు. ఓట్లప్పుడు ఓ... అంటాని ఒట్లన్నీ వాళ్ళకె గుద్ది
అందలమెక్కిస్తిరి గదా?మీ మాల మాదిగిండ్లల్ల ఒక్కఇల్లు కూడా వదులకుండ కష్టపడి తిరిగి సెపితి. అందరు
ఏస్తమేస్తమన్నరు ఎవ్వరెయ్యలే. గిట్ల కాలం అన్యాయానికి నడుస్తున్నది ఏంజేస్తం’ అని బాదనంత
ఎల్లవోస్తున్నది దొర్సాని.

“అమ్మా తోడెం నీల్లియ్యమ్మా ’’ని మల్ల గుర్తుజేసింది మయమ్మ.

“నీల్లు నీల్లు అని అరుస్తవేందే  నీల్ల వట్కనేవడేతు. యాడవొయ్యమంటూన్నవే? నీల్ల సెంబు
తీసుకురాకపోయినావ్  నీల్లు పోద్దును గదా’’ అన్నది.

“అమ్మా నేను సెంబాడ తెత్తు. దూరం ఇల్లు నేను ఇంటికి పోయేటాల్లకు అతని పానం పోతది. నీ కాల్లు
మొక్కుత నీ గులాపుదాన్ని నీవే ఏందుట్లనన్నవొయ్యి’’ అన్నది మయమ్మ. ఆడ సెంబట్క పోయ్యే లోట ఉ
న్నది కొట్టం గూట్లె అందుకో పోస్త’’ అన్నది. మైయమ్మ గుండెలు  అవిసిపోయినయి పటేలమ్మ మొఖం
జూసింది. “ ఏమే గుడ్ల గూబ చూసినట్లు అట్ల జూస్తవ్  జెల్దికావలంటవ్ పోవూ’’ అన్న వెంటనే ఎవరో ఎదల
చెయ్యేసి గట్టిగా నెట్టినట్లే ఉరికిపోయి లోట అందుకున్నది. నీల్లుపోసింది. కారుతున్న లోటల నీల్లు వట్టుకొని
మయప్ప కాడికి ఉరికొచ్చేటాల్లకు నీల్లన్ని కారిపోయినయి. లోటను భూమికిసిరి కొట్టి అటూ ఇటూ జూసింది.
అన్ని ఇండ్లు తలుపులు బెట్టి ఉన్నయి. రెడ్డి, కోమటి వాడలు నిర్మానుష్యమైనయి. నీల్లు దొరికే జాడ ఎక్కడా
లేదు.  అంత దూరంల మాలోల్ల కాశమ్మ కూలికిబోయి పగటిపూట పిల్లకు సన్నియ్యపోవట్టింది.
మయమ్మనుజూసి “ఏమైందిసిన్నమ్మ ఏడుస్తున్నవ్ ’’అని అడిగింది. మీ సిన్నప్ప నీల్లులేక సావు బత్కులల్ల
వున్నడని  చెప్పింది. “అయ్యో ఇన్ని సన్నుబాలన్న పిండుదాంపా ....ఉరుకురుకు...’’అని ఒకర్నివట్టక ఒకరు ఉ
ర్కొచ్చింద్రు. మాయమ్మ చేతిని షారబడితే  కాశమ్మ తన పాలు పిండింది. షార నిండింది నిండినట్లు
మాయప్ప నోరు తెరిపించి పోసింది. అట్లా ఏడెనిమిది షారలు పోసింది. ఇన్ని పాలు గాయంల పిండింది.
“ఇగ ఆపు కొడుకా సంటి పిల్లకు గావాలె’’ అని మాయమ్మ జెప్పింది

“మల్ల  షేపులొస్తయ్ ఇప్పుడైతే మా సిన్నప్పకుగానియ్యి’’ అని అన్నది. “యమినోల్ల కంట్లె వడ్తే ఇగ వున్నది
నాకు గండం’’అనుకుంట గోడ సందుల్ల నుండి మాల కేరీలకుర్కింది కాశమ్మ. మెల్లగ నెత్తురు గడ్డగట్టింది.
కాని  మాయప్ప కండ్లు దెరువకుండ దిమ్మరపోయి అట్లనే పడ్డడు.

లోపట టెలిఫోన్ల మాట్లాడి బయటి కొచ్చిన పటేలు మావోల్లను జూసి

“ఏమె నీళ్ళు యాడ సంపాదిస్తిరే మీరెంత చాలు బాజీ ముండలే అందరీన్నే మోపయింద్రు..కొంపలన్నీ

మునిగినట్లు ఈ ముండలను ఎందుకురా లోపలికి రానిచ్చింగ్రు మీ మాల మాదిగోల్లను జీతం బెట్కున్నందుకు మీకు గేటు తెరుస్తరే. ఉండుండి మీ పని సక్కగ జేస్త అరేయ్... మాదిగ లంజకొడుకుల్లారా.. ఆ బాలిగాని ఆడోల్లని పిల్లలను ఎందుకురా ఉండనిచ్చింగ్రు. మీ కులమని ప్రేమవుట్టినాదిరా ముందు ఇక్కన్నుంచి వాళ్ళను సొప్పకుప్పల దొడ్లకుతీసుకపోండి. వాళ్ళని ఆన్నే వదిలి మీరు బాయికాడికి పోండి'' అని గదమాయించిండు పటేలు. అయితామె పటేల అని ఇద్దరు జీతగాల్లు మయప్పను మోసుకొని పొవట్టింగ్రు. ఎంబడెంబడే మేం పోయినం. మయప్పను సొప్పదొడ్డిల పండవెట్టింగ్రు. మయవ్వ మయప్ప దగ్గరకూసోని గట్టిగట్టిగ పిలిసింది. మయప్ప మెల్లగ మూలిగిండు. మేమంతా సుట్టూకూసోని మయప్ప మొకంలకు జూస్తున్నం. మయమ్మ తన కొంగుతో మొఖానికంటిన నెత్తురు మరకలను నోటితో తడి చేసి తూడుస్తున్నది. మేం అటొక్కరం ఇటొక్కరం కూసున్నం. "పటేలొచ్చి ఏమో మాట్లడెటట్లున్నడు. యా యాల్ల అయితదో ఇప్పటికే నడిపొద్దు అయింది. మీరింటికి జేరేటాల్లకు యా పొద్దు అయితదో ఇదుంచుండి'' అని వాళ్ళరుమాలి కొంగుల కట్టిన రొట్టె సద్దిమూటను మాకిచ్చింగ్రు జీతగాల్లు.

" పటేల్ జూస్తె మమ్ముల తిడుతడు ఆ సొప్పమెద కింద దాచుకోండి'' అని చెప్పి పోయింగ్రు. మయప్ప మెల్లగ కండ్లు తెరిసిండు. మమ్ముల జూస్తున్నడు. నన్ను జూసి దిగ్గున లెవ్వబోయిండు. పెయిల కలుక్కుమనేటాల్లకు అమ్మా అని మల్ల పడిపోయిండు. నన్ను దగ్గరకు రమ్మన్నట్టు చేతి ఊపిండు. "నీవెందుకొచ్చినవురా నీకోసమె ఈసెర'' అని బిల బిల ఏడ్వవట్టిండు. మయమ్మ మయవ్వ కూడ కుమిలికుమిలి ఏడుస్తున్నరు. పటేలు మయప్పను ఇంత గొట్టి ఇంటికి పంపియ్యకుంట ఈ సొప్పదొడ్డిల ఎందుకేసినట్లు ఎవరికి సమజి కాకొచ్చె. ఏమైతేనేం మయప్పకు నెత్తురుకారుడు ఆగింది. కండ్లు తెరిసి మెల్లగ మాట్లాడుతున్నడు. మా అందరికి కొంత నిమ్మలమైంది. ఇంక పటేల్ ఏం జెప్పబోతున్నడో అని దిగులుతో ఎదురు చూసుడే మేం చేయగల్గినపని. ఐదారు మంది గుంపుల్లాగ తెల్ల ఖాది దుస్తులు తొడుక్కున్నవారు వస్తున్నరు. ఆ గుంపులో ఎస్.ఐతో పాటు, ఊరి పెద్దలంత ఉన్నరు. ఆల్లందర్ని జూసి మయప్ప ప్రాణం జల్లుల వడ్డది. ఎ.స్.ఐ ని జూసేటాల్లకు హాస్టల్ వార్డనమ్మ జెప్పిన మాటలు యాదికొచ్చి జెర్ర ధైర్యమొచ్చినట్లయింది. పటేల్ మొఖంల గూడా మునుపటంత కోపం లేదు. వాళ్ళు ఏవో కాగితాలు సేతుల వట్టుకొనొస్తున్నరు. మేమంత వాళ్ళను జూసిన వెంటనే లేసి నిలవడ్డం. మయప్ప లేవనీకెజూస్తున్నడు. నెత్తురులో తడిసిన బట్టలమూట కదలకుండ పడినట్లె ఉండిపోయిండు. "అమ్మా అమ్మా'' అనుకుంట నోటి పండ్లుగట్టిగా కొరికి పట్టి నొప్పిని ఆపుకోజూస్తున్నడు. పటేలు ఒస్తు ఒస్తునే "బాలిగా మేం చెప్పిన మాట వినకపోతివి. నా చేత అనవసరంగా దెబ్బలు తిన్నవ్.. నువ్వు ఎట్లాంటోనివో మాకు, ఈ ఊరికి తెల్వదా! ఒక సారి నా ప్రాణం నువ్వే దక్కిచ్చినవు మాకు దెల్వదారా? నా ప్రాణం నీవే దక్కిచ్చినవ్. ఆదినం సేనుకాడ కల్లంల రాసుల కుప్పల కాడ నేను నీవు ఇంకా గా కుర్వ మల్లిగాడున్నంగదా! మల్లిగాడు దూల్లగట్టేసి రాత్రికి నాకు క్యారేజీ తీసుకరానీకె ఇంటికి పొయ్యిండు. అదేసమయంల నలుగురు దారి దోపిడీ దొంగలు కందిరాసిమీదవడ్డరు. నేనడ్డంబోతే నామీదికి గొడ్డలి లేపింగ్రు. అమాంతం బొయ్యి గొడ్డలి

తీసుకొని వాన్ని అవతల్కివడేసి నా ప్రాణం బచాయించినవ్. నీవు వాల్ల సేతుల నుండి గొడ్డలిని దుసుక్కున్నది తడువేలేదు నాకు పారిపోనీకే సందుదొరికింది. పారిపోయి ఎండిన వరిగడ్డి కుప్పల జొచ్చిన వాళ్ళకు దొరకకుండ. ఇక నీ గెంట్లకట్టెతోటి ముగ్గురు దొంగలను ఒక్కొక్కన్ని సెడుగుడులాడిస్తివి. ఆదొంగలు పత్తాలేకుండా పారిపోయింద్రు. వెయ్యిల పైకం జేసే నా కంది రాసిని, నాప్రాణంను దక్కిచ్చినవ్. నేను ఊరందర్కి అప్పుడే జెప్పిన "బాలిగాడు మొనగాడు'' అని. "గిప్పుడయితే మాత్రం నీవు మొండికేస్తున్నవు. ఎవరి మాటి వినకుండ కాట్కుడవైతున్నవ్. నీ మంచికే జెపుతున్న. భూమ్మీదున్నన్ని దినాలు ఊర్ల అందరితో మంచిగుండాలే. వూరుమాట వినాలె. నీవు ఊరుమాట ఎన్నటికీ మరవగూడది. ఇవన్ని సోచాయించకుండ నీబిడ్డని సదువుకేస్తనంటవ్, అయినా సదువు జదివితె ఏమొస్తున్నదిరా అవులా. ఊరుగాని ఊర్లకు నీ బిడ్డ వంటరిగ ఎట్ల సదువ వోతది? ముందే దినాలు బాగలేవు. ఉన్న ఊర్ల ఏర్పులకేస్తె మనందరి కండ్లముందుంటది. సదివితే ఏమున్నదిరా బాలిగా ఎంత జదివినా పని తప్పది కదా జెర్రపెద్దగయితె ఎవ్వనెంబడన్న పడి పోదని ఏం నమ్మకం, యా చాయకప్పులు కడిగెటోనెంబడో పోదని ఏంగ్యారంటిరా? అన్నడు.

"మేం చెప్పినట్లు వినకుండా నీ బిడ్డను చదువుకేస్తె నీయిస్టం మరి. ఇంత జరిగినాక నీవు మాత్రం ఈ ఊర్ల ఉండనీకె వీల్లేదు. మా ఇస్టం చెప్పుత వినుండి. 'మీ పోరిని వేస్తే జోగుకు వేయండి లేదా మీరు ఊరిడిసి పోండి''. అన్నడు పటేలు. మయప్ప పులికి బెదిరిన సాదు జంతువోలే అదిరిపోయి బెదురు చూపులతో మిగిలిన వారి ముఖాలను జూసిండు. అందరు ఔనన్నట్లు తలలూపింద్రు.

మా సంగవ్వ ఒక్కసారి హా....హా....ఎదా ఎదా గుద్దుకున్నది. సొప్ప పక్కకు నతికిన మయమ్మ "మా ఇల్లు ఆరిపాయె దేవుడో'' అని బోరున ఏడ్చింది. ఆ సప్పుడుకు దొరలకు అందరికీ కోపం వచ్చింది. "ఇవే ప్రతిదానికి లొల్లిపెడుతున్నయిరా వీటిని నడుముల మీద దన్నుండి లెవ్వకుంట అడ్డం బడుతరు. కంత మీద కొడితే దెబ్బకు జస్తరు'' పటేలు బెదించేటాల్లకు నిశ్శబ్దం అయిపోయింద్రు..

"సెప్పేది జెర బాగ వినుండి మీ కోసం జెపుతున్నడు'' అని శ్రీరామ్‌శర్మ మావోల్లకు బుద్ధి జెప్పవట్టిండు.

"చూడండి మీరేమనుకుంటున్నరో మాకుతెలువది. మేం ఒకటి జెప్పితే మీరు ఇంకోటి చేస్తున్నరు. మీ మంచి కోసం జెప్తె మీ నెత్తికెక్కుత లేదు. నేజెప్పేది సెప్పుత.. తరువాత మీయిష్టం.. మీ బిడ్డను జోగినీకి వేయమన్నది నాకోసం కాదు.. ఊరుకోసం. ఊరు బాగుకోసం అంటే మీ మొద్దు మెదల్లకు అర్దం కావడం లేదు. ఇంక మీతో మాట్లాడే ఓపిక నాకు లేదు. మీ పోరిని వేస్తే జోగుకు వేయండి లేదా మీరు ఊరిడిసి పోండి. ఇదే ఆఖరు మాట. ఆ పని జెయ్యకుండ ఊర్ల ఉండనీకె వీల్లేదు. మొండికేసి ఉంట మంటిరా నిరుడు మీ మాదిగ జంగనికి వట్టిన గతే మీకు వడుతది చూస్కొండి.' అనేటాల్లకు గుడ్డేలుగు వడ్డ మేకల మందలాగ గడగడా వనికిపోయింద్రు మావోల్లు.

సూస్త సూస్త చెట్టంత మనిషిని ఒర్రంగ ప్రానం బోయిన జంగయ్యసజీవ దహనం కండ్లముందు కదిలింది. జంగయ్యను జంపినందుకు మాల, మాదిగోల్లకందిరికి దుక్కమొచ్చింది. కని ఎవ్వరూ ఏడ్వలేదు. మంత్రాలు జేస్తున్నడని పసుపు, కుంకుమ, నిమ్మకాయలు వానింట్ల దొరికినవని గాంచునూనెపోసి, రబ్బరు

టైర్లు ఏసి మని ఉన్నోన్ని ఒర్రంగ తగలవెట్టి చంపింండ్రు. ఎవ్వరన్న ఏడిస్తే వాల్లను కూడా మంత్రగాల్లంటరని దుఖాన్ని కడుపుల్ల దిగమింగింండ్రు. బుగులు వట్టి సుట్టాలు, కడుపులవుట్టినోళ్ళు.. తోడ వుట్టినోళ్ళు కూడా రాలేదు. జంగయ్య సావు తర్వాత " భూమి మీద ఇట్లాంటి ఆగం సావు ఎవ్వరికిరావొద్దని'' ప్రతి ఒక్కరు మనుసులోనే కోరుకున్నరు. "జంగయ్య బోలగాడు ఎవ్వరితో గింత మాట వడడు''. అని మైయప్ప ఎన్నోమార్లు అన్నడు. ఉపాసం ఉప్పిడి ఉండి కాయకష్టం జేసి జానెడు భూమి సంపాదించుకున్నడు. ఆ భూమి మీద పటేలుకన్ను వడ్డది. "జంగయ్యని కడతేర్చిండు'' అన్న సంగతి అందరి కడుపుల్ల ఇంకింది. కాని జంగయ్యను మంత్రగాడనేటాల్లకు ఎవ్వరికి నోరు రాలేదు. "అదే గతి నీకు వడ్తది'' అంటె మా వోల్లకు ఒనుకుడు పుట్టింది. కండ్లు త్యాలేసింండ్రు. "అందుకే శానతనం జెయ్యకుండ ఈ కాయితాల మీద దస్కత్‌వెట్టు'' అన్నడు. నిజానికి మైయప్ప మంచిగ అక్షరాలు రాస్తడు, సదువుతడు నాకు ముందు ఓనమాలు నేర్పింది మాయప్పనే. అంతే గాదు మా మాల మాదిగోల్లకు పోతులూరి వీర బ్రహ్మంగారి ఆటలు నేర్పే ఆటపంతులూ మయప్పనే. కాని కాయితాల మీద పేరురాస్త అనలేదు. "నా భూమిని గుంజుకోనీకే ఏలు ముద్ర వేయమన్నడు'' అన్న సంగతి మేల్తమయి. దిక్కుతోచకుండ అయ్యింది. ఇప్పుడు ఇది కాదు అంటే నాబిడ్డను జోగినికిడ్వాలె. అదికాదు అంటే భూమిని ఇడ్వాలే. ఇప్పుడు మయప్ప స్థితి పంగల నడుమ మేడికాయలెక్క అయింది. ఏ ఆలోచనలు లేకుండా మావోల్లందరు నిర్వీర్య మయింండ్రు.

"కానీయండి అవతల మాకు చాలా పనులున్నయి. మీ కోసం ఎంతసేపు కూసోవాలె'' అని నలుగురు పటేండ్లు ఒకసారే అన్నరు. వాల్లే మా సంగవ్వ, మయప్ప దగ్గరకొచ్చి వేలుముద్రలు ఒత్తిచ్చుకున్నరు.

" బస్సు కిరాయిలు దీసుకొని ఇగో ఊరిడ్సి పోండని' పటేల్ మయప్పకు నాలుగైదు పచ్చనోట్లు ఇచ్చిండు. "అంతా అయిపోయింది.. ఇల్లు ఆరిపోయింది. బుడం నాశనమయింది'' మా సంగవ్వ నెత్తి నెత్తి కొట్టుకున్నది.

"ఇప్పటి నుండి సడాక్ పక్కనున్న ఎర్రరేగడి బిల్ల మాదిగాదు. ఆడ్క పక్కనున్న రాగడి చెక్క మాది కాదు. మాదిగ కేరి మాదికాదు. మాయి ముంతలు పాతిన మా ఇంటి వాకిలి మాదికాదు. డంగు సున్నంబోసి కట్టిన మంటిల్లు మాదిగాదు. కేరీ మాదికాదు ఊరు మాదికాదు. గూడులేని పక్షులమైతిమి దిక్కులేని అనాదలమైతిమి'' అని మాయవ్వ, మయమ్మ బజార్ల పొర్లాడి పొర్లాడి ఏడుస్తున్నరు. అయినా ఫలితం లేదు. పెయిమీదున్న దుస్తులతోనే కొత్తపేట బాటవట్నం. "నిన్ను సదువుకేస్తనన్నందుకే గీగతి వట్టింది కొడుక మేం మా రెక్కలు గట్టిగున్నన్ని దినాలు కూలీనాలీ జేసి నీకు వెడుతం, నీవు మామీద రంది వెట్టుకోకు. నీవు బాగ చదివి పెద్ద ఆఫీసరమ్మవుగావాలె'' అన్న మా వోల్ల ధైర్యం నాకు సదువు నేర్పింది. జోగినిని కానన్నందుకు భూమిని వొదులుకున్న నా బాల్యం మాయింటికి, వాడకి, నాకు రడమై నేటికీ సల్పుతుంటది.